వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా

చర్యలు తీసుకోవాలి

- ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

రంగారెడ్డి, మార్చి 26 (నమస్తే తెలంగాణ) : తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సూచించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తాగునీటి ఎద్దడి నివారణ చర్యలతో పాటు, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, సీఎంఆర్ లక్ష్యం తదితర వాటిపై దిశా నిర్దేశం చేశారు. రంగారెడ్డి కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్లు ప్రతిమాసింగ్, భూపాల్ రెడ్డి, సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్ శశాంక వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలోని 16 పురపాలక సంఘాలు, 558 గ్రామపంచాయతీల్లో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక కార్యాచరణ ప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు కోసం వెంటనే చర్యలు తీసుకోవాలని, జిల్లాలో 40వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా ఉందని, ధాన్యం కొనుగోళ్లకై ఐకేపీ ఆధ్వర్యంలో 3, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 27, డీసీఎంసీ ఆధ్వర్యంలో 9 కలిపి మొత్తం 39 కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆయా కేంద్రాల్లో అన్ని సౌకర్యాలతోపాటు ప్యాడి క్లీనర్, టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కస్టం మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) లక్ష్యాలను వెంటనే పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి (డీఎస్‌వో) మనోహర్ రాథోడ్, డీసీఎస్‌వో విజయలక్ష్మి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఐకేపీ ఆధ్వర్యంలో 122 ధాన్యం కొనుగోలు కేంద్రాలు

వికారాబాద్ : గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని, జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. ఆమె నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) రాహుల్‌శర్మ, (రెవెన్యూ) లింగ్యానాయక్ , సంబంధిత అధికారులతో కలిసి వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించి జిల్లాలో 4 పురపాలక సంఘాలు, 565 గ్రామపంచాయతీల్లో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక కార్యాచరణ ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు కోసం వెంటనే చర్యలు తీసుకోవాలని, ఐకేపీ ఆధ్వర్యంలో 122 కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆ కేంద్రాల్లో ప్యాడీ క్లీనర్, టార్పలిన్లు, గన్నీబ్యాగులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కస్టం మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) లక్ష్యాలను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డీఎస్‌వో రాజేశ్వర్, డీఎం సుగుణాబాయి, అడిషనల్ డీఆర్‌డీఏస రోజ, మిషన్ భగీరథ అధికారులు బాబు శ్రీనివాస్, చెల్మారెడ్డి, డీపీవో జయసుధ సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఎస్‌వో పాల్వన్‌కుమార్

టీబీ నియంత్రణలో

వికారాబాద్ జిల్లా రాష్ట్రంలో రెండో స్థానం

జిల్లా ఆరోగ్య, వైద్యాధికారి డాక్టర్ పాల్వన్‌కుమార్

వికారాబాద్, మార్చి 26 : తెలంగాణ రాష్ట్రంలో టీబీ నిర్ధారణ, చికిత్స, నియంత్రణలో వికారాబాద్ జిల్లా రెండో స్థానంలో ఉన్నదని జిల్లా ఆరోగ్య వైద్యాధికారి డాక్టర్ పాల్వన్‌కుమార్ అన్నారు. మంగళవారం ప్రపంచ టీబీ దినోత్సవాన్ని పురస్కరించుకొని రామయ్యగూడ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి పోలీస్‌స్టేషన్ వరకు వైద్య సిబ్బందిచే నిర్వహించిన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీబీ నివారణలో రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానంలో ఉండేలా అధికారులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. ఈ సంవత్సరం టీబీ నిర్మూలనకు విశేషంగా కృషి చేసిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తాండూరు వైద్యాధికారి డాక్టర్ గిరిధర్, చిట్యాల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్, సిబ్బందిని కొనియాడారు. కృషి చేసిన వారికి ఆయన ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో టీబీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రవీంద్రయాదవ్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పవిత్ర, సిబ్బంది ఉన్నారు.

పీహెచ్‌డీ ఫీజు పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

ఓయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పరిశోధక విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 26: ఓయూలో పీహెచ్‌డీ కోర్సుల ఫీజు పెంపు నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. ఓయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్‌ను కలిసి మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఏఐఎస్ఎఫ్ ఓయూ కార్యదర్శి నెల్లి సత్య మాట్లాడుతూ.. 2022-23 విద్యాసంవత్సరానికి రూ.2వేలున్న ఫీజును ఎలాంటి హేతుబద్ధత లేకుండా ఆర్ట్స్, సోషల్‌సైన్స్, కామర్స్, మేనేజ్‌మెంట్, లా, ఎడ్యుకేషన్ విభాగాలకు రూ.20వేలు, ఇతర విభాగాలకు రూ.25 వేలకు పెంచారని చెప్పారు. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఏడాది కాలంగా పరిశోధక విద్యార్థులు అనేక నిరసనలు చేశారని గుర్తు చేశారు. ఫీజుల పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవడంలో అధికారులు జాప్యం చేశారని ఆరోపించారు. ప్రస్తుతం తమ వినతిపై అధికారులు సానుకూలంగా స్పందించారని చెప్పారు. వచ్చే నెల 23న జరిగే స్టాండింగ్ కమిటీ సమావేశంలో అన్ని విభాగాల డీన్లతో మాట్లాడి ఫీజుల పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటామని హామీ ఇచ్చారని వివరించారు. కార్యక్రమంలో పరిశోధక విద్యార్థులు స్పందన, అఖిల్, యాదగిరి, సందీప్, మహేశ్, లక్ష్మణ్, స్వరాజ్, ఆంజనేయులుగౌడ్, శివాజీ, గోవర్ధన్, నరేందర్, అనురాజ్, రవి, జయప్రకాశ్ నారాయణ, సాయివినీత్ పాల్గొన్నారు.

కన్నారావు కోసం పోలీసుల వేట..

- లుక్ అవుట్ నోటీస్ జారీ
- సెల్‌ఫోన్ లోకేషన్ మార్చుతూ ఎస్కేప్

ఆదిబట్ల, మార్చి 26 : అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, మన్నెగూడ గ్రామంలోని సర్వే నంబర్-32లో 2ఎకరాల 17 గుంటల స్థలానికి సంబంధించిన భూవివాదంలో ప్రధాన నిందితుడైన కల్వకుంట్ల తేజేశ్వర్‌రావు అలియాస్ కన్నారావును పట్టుకునేందుకు పోలీసులు వేట మొదలెట్టారు. ఇప్పటికే ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. అయితే అతడు పోలీసులకు చిక్కకుండా సెల్‌ఫోన్ లోకేషన్ మారుస్తూ తిరుగుతున్నాడని.. గత కొన్ని రోజులుగా బెంగళూరు, గోవా, చెన్నైతో పాటు పలు ప్రాంతాల్లో తిరుగుతున్నట్లు వారు గుర్తించారు. కాగా అతడు విదేశాలకు పారిపోకుండా ఉండేందుకు లుక్ అవుట్ నోటీస్‌తోపాటు పాస్‌పోర్టు సీజ్ కోసం సర్క్యులర్‌ను జారీ చేశారు. ఇప్పటికే కన్నారావు పాస్‌పోర్ట్ వివరాలను అన్ని ఎయిర్‌పోర్టులకు పోలీసులు పంపించారు. త్వరలోనే అతడితోపాటు మిగిలిన నిందితులను కూడా అరెస్టు చేస్తామని ఆదిబట్ల పోలీసులు తెలిపారు. కాగా ఈ భూవివాదంలో 38 మంది పై కేసులు నమోదు చేసిన పోలీసులు పలువురిని రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే.

పూర్తయిన ర్యాండమైజేషన్ ప్రక్రియ

పర్యవేక్షించిన రంగారెడ్డి, వికారాబాద్ కలెక్టర్లు శశాంక, నారాయణరెడ్డి

రంగారెడ్డి కలెక్టర్ శశాంక పర్యవేక్షణలో జరుగుతున్న పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియ

రంగారెడ్డి, మార్చి 26 (నమస్తే తెలంగాణ) : పార్లమెంటు ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా మంగళవారం పోలింగ్ సిబ్బంది మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక నేతృత్వంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఎన్‌ఐసీ హాల్ లో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. రంగారెడ్డి జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజక వర్గాల పరిధిలో గల పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు (పీఓ), సహాయ ప్రిసైడింగ్ అధికారులు (ఏపీఓ), ఇతర పోలింగ్ అధికారులు (ఓపీఓ) లను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. రిజర్వ్ సిబ్బందిని కలుపుకుని జిల్లా పరిధిలోని ఎనిమిది సెగ్మెంట్లకు 16,536 మంది పోలింగ్ సిబ్బందిని నియమిస్తూ ర్యాండమైజేషన్ జరిపారు. వీరిలో పీవోలు 4,076 మంది ఉండగా.. ఏపీవోలు 3,968., ఓపీవోలు 7,952., మైక్రో అబ్జర్వర్లు 540 మంది ఉన్నారు. పోలింగ్ సిబ్బందికి ఎంపిక చేసిన వివిధ కేంద్రాలలో మాస్టర్ ట్రైనర్స్‌తో పోలింగ్ నిర్వహణపై శిక్షణా తరగతులు నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకొని పోలింగ్ విధుల కోసం నియమించబడిన సిబ్బందికి తక్షణమే ఉత్తర్వులతో పాటు ఫామ్-12ను కూడా అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఏప్రిల్ 1, 2తేదీల్లో పీవోలు, ఏపీవోలకు పోలింగ్ నిర్వహణపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ర్యాండమైజేషన్ ప్రక్రియలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఆర్‌వో సంగీత, జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, ఎన్‌ఐసీ అధికారి స్వర్ణలత, మ్యాన్ పవర్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారి శ్రీలక్ష్మి, ఎన్నికల విభాగం అధికారి సైదులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వికారాబాద్ జిల్లాలో..

వికారాబాద్ : జిల్లాలో జరిగే సాధారణ లోకసభ ఎన్నికలకు సంబంధించి పీవో, ఏపీవో, ఓపీవోల విధుల కేటాయింపునకు మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించినట్లు వికారాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం ఐడీఓసీ ఎన్ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నియోజకవర్గాలకు సిబ్బంది కేటాయింపునకు ఆన్‌లైన్ ద్వారా మొదటి విడుత ర్యాండమైజేషన్ పూర్తి చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో కొడంగల్, పరిగి, తాండూరు, వికారాబాద్ నియోజకవర్గాలకు పీవో, ఏపీవో, ఓపీవో పోలింగ్ సిబ్బందికి మొదటి దశ ర్యాండమైజేషన్ ద్వారా విధులు కేటాయించినట్లు తెలిపారు. ప్రక్రియ పూర్తి చేసి స్క్రీన్ ద్వారా చూపించారు. ర్యాండమైజేషన్ ప్రక్రియ తదుపరి మాస్టర్ ట్రైనర్స్‌చే పీవో, ఏపీవోలకు శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు రాహుల్‌శర్మ, లింగ్యానాయక్, ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఈడీఎం మహమ్మద్, అధికారులున్నారు.

పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

గంజాయి స్వాధీనం.. నలుగురు అరెస్ట్

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి, పోలీసుల అదుపులో నిందితులు

పరిగి, మార్చి 26 : కుట్రపూరితంగా ఓ వ్యక్తిని కేసులో ఇరికించేందుకు అతడి వాహనంలో గంజాయి పెట్టే ప్రయత్నం చేసిన నలుగురు వ్యక్తులను పరిగి పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి 207 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం పరిగిలోని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పరిగి డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి ఈ కేసుకు సంబంధించి తెలియజేశారు. పరిగికి చెందిన ముషారఫ్, సయ్యద్ ఉజాయిఫ్‌లకు గత కొంతకాలంగా పడడంలేదు. దీంతో ఉజాయిఫ్ పరిగి మండలం షోండేపూర్‌కు చెందిన తన స్నేహితుడు పాల్త్యా సతీష్‌కు ఈ విషయం చెప్పగా ఏదో ఒక కేసులో ఇరికిద్దామని సలహా ఇచ్చాడు. ముషారఫ్‌ను గంజాయి కేసులో ఇరికించాలని నిర్ణయించారు. సయ్యద్ ఉజాయిఫ్ తన మరో స్నేహితుడు పరిగి మండలం సయ్యద్‌మల్కాపూర్‌కు చెందిన వడ్ల సాయిరాంకు విషయం చెప్పాడు. గంజాయి తెప్పిస్తానంటూ హైదరాబాద్‌లోని మలక్‌పేట్‌లో ఉంటున్న పరిగి మండలం పెద్ద మాదారంకు చెందిన కొత్తిలి ప్రశాంత్‌ను గంజాయి కావాలని సాయిరాం అడిగాడు. ఇప్పిస్తానని చెప్పడంతో ఉజాయిఫ్, వడ్ల సాయిరాం కలిసి హైదరాబాద్ నుంచి 207 గ్రాముల గంజాయి తీసుకువచ్చారు. ఈ మేరకు 25న మధ్యాహ్నం సమయంలో నమ్మదగిన సమాచారం రావడంతో పరిగిలోని బహిర్‌పేట్‌లో ఒక కారులో నిషేధిత గంజాయి ఉన్నదని తెలియగా.. పరిగి పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు. గంజాయి కేసులో ముషారఫ్‌ను ఇరికించేందుకే సయ్యద్ ఉజాయిఫ్, వడ్ల సాయిరాం, పాల్త్యా సతీష్, కొత్తిలి ప్రశాంత్ కలిసి ఈ పన్నాగానికి ఒడిగట్టారని విచారణలో తేలడంతో వారిపై 20(బి)(ఐఐ)(ఎ), 29, 58(2) ఎన్‌డీపీఎస్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి నలుగురిని అరెస్టు చేశారు. దీంతోపాటు 207 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి తెలిపారు. నలుగురు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్ఐ సంతోష్ పాల్గొన్నారు.

స్వాధీనం చేసుకున్న గంజాయి

వికారాబాద్ : జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో డీఎంహెచ్‌వో డాక్టర్ పాల్వన్‌కుమార్ తెలంగాణ మెడికల్, హెల్త్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ డైరీ, క్యాలెండర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఆయనతోపాటు అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ చంద్రప్రకాశ్, సీహెచ్‌వోలు డా.జీవరాజ్, డా.సాయిబాబా, డా.రవీంద్రయాదవ్, శ్రీనివాస్, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

బాపల్లితండాలో నీరందక ఎండిపోయిన పాండూనాయక్ వరిపాలం

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

బొంరాస్‌పేట, మార్చి 26 : బొంరాస్‌పేట మండలంలోని పలు గ్రామాల్లో భూగర్భ జలాలు తగ్గడంతో రైతులు బోర్ల కింద యాసంగిలో సాగు చేసిన వరి పంటలు ఎండిపోతున్నాయని, నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు సూర్యానాయక్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం మండలంలో పర్యటించిన ఆయన నీరందక ఎండిపోయిన వరి పొలాలను పరిశీలించి రైతుల సాదకబాధకాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సూర్యానాయక్ మాట్లాడుతూ.. బాపల్లితండా తదితర గ్రామాల్లో బోర్లలో నీటిమట్టం తగ్గి వరి పంటలు ఎండిపోతున్నాయని, లాగోడి పెట్టిన రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. కొత్తగా బోర్లు వేసి పంటలను కాపాడుకుందామన్నా నీళ్లు వస్తయో రావో అన్న ఆందోళన రైతుల్లో ఉందన్నారు. ప్రభుత్వం స్పందించి ఎండిపోయిన పంటలకు పరిహారం ఇవ్వాలని కోరారు.

పోలింగ్ సిబ్బందికి విధుల కేటాయింపు

వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ

వికారాబాద్, మార్చి 26 : జిల్లాలో జరిగే సాధారణ లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ విధులు నిర్వహించే రూట్ ఆఫీసర్లు, సెక్టోరియల్ ఆఫీసర్లకు రూట్లవారీగా విధులు కేటాయించినట్లు జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. మంగళవారం ఐడీవోసీ సమావేశం హాలులో జరిగిన కార్యక్రమంలో రూట్ ఆఫీసర్లు, సెక్టోరియల్ ఆఫీసర్లకు తమ రూట్లవారీగా విధులు కేటాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాలకు సీరియల్ నంబర్ల వారీగా రూట్ ఆఫీసర్లు, సెక్టోరియల్ అధికారులకు కేటాయించిన రూట్లను చెక్ చేసుకోవాలని సూచించారు. రూట్లకు సంబంధించి రూట్ మ్యాపులు, ఎన్నికల పోలింగ్ కేంద్రాలవారీగా జాబితాను తయారు చేసినట్లు ఆయన తెలిపారు. సమావేశంలో డీఎస్పీ శ్రీనివాస్‌రెడి, అధికారులు పాల్గొన్నారు.

మ్యాంగో మార్కెట్ యార్డులో తనిఖీలు

37 క్రేట్ల మామిడిపండ్లను సీజ్ చేసిన అధికారులు

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 26 : గడ్డిఅన్నారం పరిధిలో గల బాటసింగారం పండ్ల మార్కెట్‌లోని మ్యాంగో మార్కెట్ యార్డులను ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ (ఐపీఎం) డైరెక్టర్ శివలీల ఆధ్వర్యంలో సోమవారం ఫుడ్ సేఫ్టీ అథారిటీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఏకకాలంలో అన్ని షెడ్లలో తనిఖీలు నిర్వహించగా మార్కెట్ యార్డులో ఖరీదుదారులందరూ దాదాపు ఫుడ్ సేఫ్టీ ప్రమాణాల ప్రకారమే మ్యాంగో ప్యాకింగ్ చేస్తున్నారని అధికారులు తెలిపారు. కాగా.. ఒక ఖరీదుదారుడు కుమార్ అగర్వాల్ అదనంగా ఎథిలైన్ ప్యాకెట్లు వేసి మ్యాంగో ప్యాకింగ్ చేస్తున్నందున వారి 37 క్రేట్ల మామిడి పండ్లను సీజ్ చేసినట్లు తెలిపారు. ఇక నుంచి ఎవరైనా ఖరీదుదారు అనుమతికి మించి అధిక మొత్తంలో ఎథిలైన్ ప్యాకెట్లు వాడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ప్యాకింగ్ ఏ విధంగా చేయాలో హమాలీలకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఫుడ్ సేఫ్టీ అథారిటీ డిప్యూటీ ఫుడ్ కంట్రోలర్ విజయ్‌కుమార్, చీఫ్ ఫుడ్ అనలిస్ట్ జీఎల్ఎన్ రెడ్డి, ఏఎఫ్‌సీ ఖలీల్, ఫ్రూట్ మార్కెట్ కార్యదర్శి నర్సింహారెడ్డి, యార్డు ఇన్‌చార్జి లాబన్, సూపర్‌వైజర్లు మురళీధర్, ధర్మేంద్ర, డీవో సంగారెడ్డి నాయక్, డీవో నిజామాబాద్ ఉదయ్‌కిరణ్, ఎఫ్ఎస్‌వో రంగారెడ్డి సునీత, ఎఫ్ఎస్‌వో కామారెడ్డి జగన్నాథం, ఎఫ్ఎస్‌వో వికారాబాద్ ఉన్నారు.

బాటసింగారం పండ్ల మార్కెట్‌లోని మ్యాంగో మార్కెట్ యార్డులో తనిఖీ చేస్తున్న ఫుడ్ సేఫ్టీ అథారిటీ అధికారులు


పెద్దఅంబర్‌పేట : అబ్దుల్లాపూర్‌మెట్ మండలం గౌరెల్లి గ్రామ మాజీ సర్పంచ్ తుడుము మల్లేశ్, గ్రామ పెద్దలు నల్లోల్ల పాండు, దోటి శంకర్ తదితరులు మంగళవారం హైదరాబాద్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు.

సుద్ద ఫ్యాక్టరీలో మైనింగ్ అధికారుల తనిఖీ

- ఫ్యాక్టరీకి నోటీసులు జారీ చేయనున్నట్లు విశ్వసనీయ సమాచారం
- తనిఖీల వివరాలను వెల్లడించిన తాండూరు మైన్స్ ఏడీ సత్యనారాయణ

పెద్దేముల్, మార్చి 26 : మైనింగ్ అధికారులు ఓ సుద్ద పరిశ్రమలో తనిఖీ నిర్వహించారు. మంగళవారం మండల పరిధిలోని మారేపల్లి గ్రామ శివారులోని ఓ ఫ్యాక్టరీలో మైన్స్ ఏడీ సత్యనారాయణ నేతృత్వంలో ఫ్యాక్టరీలో తనిఖీ చేశారు. ఫ్యాక్టరీలో గల పుల్లర్స్ ఎర్త్ లంబ్స్ కొలతలు, రాయల్టీలు, పలు రకాల బిల్లులు, ఫ్యాక్టరీ నిర్వహణ, సుద్ద తదితర అంశాలకు సంబంధించిన ధ్రువపత్రాలను పరిశీలించారు. అనంతరం మైన్స్ ఏడీ సత్యనారాయణ మాట్లాడుతూ.. సాధారణ తనిఖీల్లో భాగంగా ఓ సుద్ద పరిశ్రమను తనిఖీ చేసినట్లు తెలిపారు. ఫ్యాక్టరీలో రాయల్టీలు, సుద్ద నిక్షేపాల నిల్వలను కొలిచామన్నారు. ఫ్యాక్టరీలో రాయల్టీలతో పాటుగా సుద్ద నిక్షేపాల నిల్వలు, రాయల్టీలకు సంబంధించిన అన్ని అంశాలను గత నెలలో సైతం తమ కార్యాలయానికి అందజేశామని ఫ్యాక్టరీ యాజమాన్యం తెలిపింది తాజాగా లెటర్ ప్యాడ్‌పై మరోమారు తమకు అన్ని ధ్రువపత్రాలను అందజేయాలని ఏడీ సూచించారు. ఇదిలా ఉంటే మారేపల్లి గ్రామ శివారులో పలు ఫ్యాక్టరీలు ఉన్నప్పటికీ 3 సార్లు కూడా ఒకే సుద్ద ఫ్యాక్టరీలో మైన్స్ అధికారులు తనిఖీ చేయడం అత్యంత విశేషంగా మారింది. ఫ్యాక్టరీలో ఎలాంటి లోటుపాట్లు లేకపోవడం, లీగల్‌గా అన్ని రకాల ధ్రువపత్రాలు ఉన్నప్పటికీ కూడా మైన్స్ అధికారులు ఒకే ఫ్యాక్టరీలో తనిఖీ చేయడం గమనార్హం. ముఖ్యంగా ఫ్యాక్టరీకి సంబంధించిన ధ్రువపత్రాలు తదితర అంశాలను మైన్స్ అధికారులకు పూర్తి వివరాలను వివరించేందుకు సుద్ద ఫ్యాక్టరీకి నోటీసులు జారీ చేయనున్నట్లు సమాచారం.

ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనది

వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, మార్చి 26 : ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనదని ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని, అందరికీ అవగాహన కలిగేలే స్వీప్ కార్యక్రమంలో భాగంగా 5కే రన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం ఎన్ఐసీ, వీసీ హాలులో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్వీప్‌లో భాగంగా జిల్లాలో ఎన్నెపల్లి చౌరస్తా నుంచి అలంపల్లి చౌరస్తా వరకు బుధవారం ఉదయం 6 గంటలకు 5కే రన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్, మెడికల్, నర్సింగ్ కళాశాలల విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొనేలా సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొనేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు రాహుల్‌శర్మ, లింగ్యానాయక్, తాండూరు ఆర్‌డీవో శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, మైనార్టీ అధికారిణి సుధారాణి, డీవైఎస్‌వో హనుమంతరావు, అడిషనల్ డీఆర్‌డీఏ సరోజ, సంబంధిత అధికారులున్నారు.

పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించండి

రంగారెడ్డి కలెక్టర్ శశాంక

రంగారెడ్డి, మార్చి 26 (నమస్తే తెలంగాణ) : పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని రంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో పార్లమెంటు ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా పోలింగ్ సిబ్బందికి, అత్యవసర సేవల సిబ్బందికి.. పోస్టల్ బ్యాలెట్ ఇచ్చే ప్రక్రియ పకడ్బందీగా జరిగేలా పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారులు, సిబ్బందికి కలెక్టర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పోస్టల్ బ్యాలెట్‌పై అధికారులు స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల రోజున విధులు నిర్వహించే పోలింగ్ సిబ్బందికి, ఈ ప్రక్రియలో పాల్గొనే పోలింగ్ సిబ్బందికి, పోలీస్ సిబ్బందికి, సర్వీస్ ఓటర్లకు ఫారం-12 అందించి ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఓటింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. ఫెసిలిటేషన్ సెంటర్‌లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయడానికి వచ్చే ఇతర జిల్లాల సిబ్బందికీ ఒక రోజు స్పెషల్ క్యాజువల్ లీవ్ మంజూరు చేయడం జరుగుతుందన్నారు. అవగాహన లేకపోవడం వల్ల పోస్టల్ బ్యాలెట్లు కొన్ని చెల్లకుండా పోతున్నాయని, ఈసారి ఒక్కటి కూడా చెల్లని ఓటు ఉండకుండా పోస్టల్ బ్యాలెట్